సాక్షి
మంచిర్యాల
శుక్రవారం : 23 : ఫిబ్రవరి : 2024



గాంధారి మైసమ్మ జాతర

మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు సన్నద్ధమవుతోంది. మూడు రోజులపాటు సాగే జాతరకు అశేష భక్తజనం తరలిరానుంది. 8లో▸



మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

ప్రధానమంత్రి మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మికులతో సమావేశం అయ్యారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. పగటి వేళ ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గూడెంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



హోమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిత్యవిధి, ప్రబోధికి ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్ఠి, హవనము, ప్రధాన ఆలయ సమీపంలోని యజ్ఞశాలలో స్థాలీపాక పంచసూక్త హోమములు ఘనంగా నిర్వహించారు. సప్తాహ భజనలు కొనసాగాయి.

'రైతులపై కాల్పులను ఖండిస్తున్నాం'



కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పాతమంచిర్యాల: హర్యానా, పంజాబ్ రాష్ట్రాల సరిహద్దులో రైతులపై మోదీ ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర లాల్‌కుమార్ అన్నారు. పోలీస్ కాల్పులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతికి కారణమైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, డివిజన్ కార్యదర్శి అరుణ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ భార్య ఉద్యోగంపై ఫిర్యాదు?

లక్సెట్టిపేట: మున్సిపాల్టీలోని తొమ్మిదో వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఒరగంటి శ్రీకాంత్ భార్య కళ్యాణి ఉద్యోగంలో అక్రమాలు జరిగాయని చర్చనీయాంశంగా మారింది. కళ్యాణి తండ్రి రమేష్ ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వర్తించాడు. వాలంటరీ రిటైర్మెంట్ ద్వారా కూతురుకు ఉద్యోగం ఇచ్చాడు. ఆమె ప్రస్తుతం ఇటిక్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వాలంటరీ రిటైర్మెంట్ కాదని, ధ్రువీకరణ పత్రాల్లో లేట్ అని ఉన్నదని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై వివరణ ఇవ్వాలని కోరినట్లు సమాచారం. కౌన్సిలర్ స్పందిస్తూ తన భార్యకు తండ్రి ఇవ్వడంతోనే ఉద్యోగం వచ్చిందని, అక్రమాలు జరగలేదని తెలిపారు.

బీజేపీలో జోష్!

- 'విజయ సంకల్ప యాత్ర'తో ఉత్సాహం
- లోక్‌సభ ఎన్నికల ముందే ప్రజల్లోకి ప్రచారం
- 'ఎంపీ' స్థానాలు గెలుపే లక్ష్యంగా ముందుకు..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు పార్లమెంటు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన 'విజయ సంకల్ప యాత్ర' ఆ పార్టీ కేడర్‌లో జోష్ నింపుతోంది. ఈ నెల 20న నిర్మల్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ముఖ్య అతిథిగా హాజరై యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర ప్రధానంగా ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాల్లోని పది అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సాగేలా ఏర్పాట్లు చేశారు. నిర్మల్, ముధోల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ఉండడం, సిట్టింగ్ ఎంపీ సైతం ఆ పార్టీకి చెందిన వారే కావడంతో గతంలో కంటే ప్రస్తుతం పార్టీ బలపడిందని ఉత్సాహాన్ని నింపుతోంది. యాత్రలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మికులతోపాటు ఈస్గాం స్థానిక బెంగాలీలతో సమావేశం అయ్యారు. ఇక పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల్లో ఈ యాత్ర శుక్రవారం సాగనుంది. తాండూరు, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల మీదుగా విజయ సంకల్పయాత్ర సాగుతుంది. మంచిర్యాల పట్టణంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జీ కొప్పు భాష, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తోపాటు యాత్ర ప్రముఖ్ పల్లె గంగారెడ్డి, సహ ప్రముఖ్ రజనీశ్ జైన్, ఇతర జిల్లా నాయకులు పర్యవేక్షిస్తున్నారు. స్థానికంగా నియోజకవర్గ బాధ్యులు యాత్రను సమన్వయం చేస్తున్నారు.

బైక్ ర్యాలీలు, కార్నర్‌మీటింగ్‌లు

'విజయ సంకల్ప యాత్ర'లో భాగంగా ప్రధాన పట్టణాల్లో పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులతో కార్నర్‌మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. కార్యకర్తలు, నాయకులతో బైక్ ర్యాలీలు చేపడుతున్నారు. దీంతో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్, పెద్దపల్లి స్థానాల్లో గెలిచి తీరాలనే పట్టుదలతో ఉంది. దీంతో ఆ మేరకు కేడర్‌ను సన్నద్ధం చేసే దిశగా ఈ యాత్ర సాగుతోంది. యాత్రలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ ప్రత్యర్థి పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రధాన ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ఈ యాత్ర ఉపయోగపడుతుందనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా హిందూత్వ ఓట్లు, యువత ఓట్లపై దృష్టి సారించారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల చరిత్రలో ఎంపీగా ఎవరూ గెలవలేదు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేసేందుకు పార్టీ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు సెగ్మెంట్‌తో పోలిస్తే, పెద్దపల్లి పరిధిలో పార్టీ అంతగా బలంగా లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడ ఆశించిన మేర ఓట్లు రాలేదు. బెల్లంపల్లి, చెన్నూరులో చాలా తక్కువగా రాగా, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో కొంత పుంజుకుంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల నాటికి మరింత బలం పెంచుకుని, రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్‌ను ఢీకొట్టాలని ప్రయత్నిస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ బలహీన పడడంతో ఆ ఓటు బ్యాంకు తమ వైపు తిప్పుకుని గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

కేంద్ర పథకాలపై ఫోకస్..

యాత్రలో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్రానికి అందిస్తున్న నిధుల వాటా వెల్లడిస్తున్నారు. ఇప్పటికే వికసిత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేశారు. అలాగే 'గావ్ చలో' కార్యక్రమంలోనూ పీఎం నరేంద్ర మోదీ హయాంలో చేపట్టిన పథకాలపై ప్రజల్లో ప్రచారం నిర్వహించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ స్థానికంగా పట్టు పెంచుకుని గెలించేందుకు ప్రయత్నిస్తోంది.

లక్ష్యసాధనలో ఇష్టాలు త్యాగం చేయాలి

- తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు
- గుడిపేట బెటాలియన్‌లో కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభం



శిక్షణ కానిస్టేబుళ్లకు మెటీరియల్ అందిస్తున్న సీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎంచుకున్న లక్ష్యాలను సాధించే క్రమంలో ఇష్టమైన వాటిని త్యాగం చేస్తేనే ఎలాంటి లక్ష్యమైనా సులువుగా చేరుకుంటామని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ స్టైఫండరీ కేడేట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుల్(ఎస్‌సీటీపీసీ) శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే క్రమంలో క్రమశిక్షణతో కష్టపడి కల సాకారం చేసుకోవాలని అన్నారు. తాను రెండు దఫాలుగా సివిల్స్ ఇంటర్వ్యూ వరకు వెళ్లినా విఫలం కాగా గ్రూపు–1 ద్వారా ఇప్పుడు ఐపీఎస్‌గా ఉండడం గర్వంగా ఉందని ఆ జ్ఞాపకాలను పంచుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని సరికొత్త విషయాలను నేర్చుకుంటూ పోలీసు వృత్తి నైపుణ్యాన్ని పొందాలని అన్నారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి కష్టపడి లక్ష్యాన్ని చేరుకున్నారని, ఇప్పుడు సమాజ సేవకు అరుదైన అవకాశంగా భావించాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకుని యూనిట్‌కు పేరు తీసుకురావాలని, నీతి, నిజాయతీతో కూడిన విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిపేట బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సైలు సురేశ్, రవికుమార్, యూనిట్ మెడికల్ అధికారులు శ్రీధర్, డానియల్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు



ఫైర్‌వర్క్‌ను పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్

కోటపల్లి: ప్లాంటేషన్‌లో ఫైర్‌లైన్ల ద్వారా అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజనల్ మేనేజర్ శ్రావణి ఆధ్వర్యంలో మండలంలోని బ్రహ్మణపల్లిలో టీఎస్‌ఎఫ్‌డీసీకి చెందిన నీలగిరి, టేక్ ప్లాంటేషన్లలో చెట్ల ఎదుగుదలకు చేపట్టిన నిర్వహణ పనులను పరిశీలించారు. వేసవికాలంలో ప్లాంటేషన్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యమధ్యలో ఫైర్‌లైన్లు చేయడంతో ప్లాంటేషన్ అగ్నిప్రమాదం నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్ లచ్చన్న, ఓదెలు పాల్గొన్నారు.

బాలబాలికల్లో రక్తహీనత

- అధిగమించేందుకు చర్యలు
- రోజుకు 300 మందికి పరీక్షలు



విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం

నెన్నెల: బాల్యాన్ని రక్తహీనత బలహీన పరుస్తోంది. ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. ప్రధానంగా బాలికలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అనిమియా ముక్త్ భారత్ పథకంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య, విద్యాశాఖ సహకారంతో జిల్లాలో రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి 24న ప్రారంభం కాగా మార్చి 11వరకు పూర్తి చేయనున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 8వ తరగతి మొదలు ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు. రోజుకు వంద నుంచి 300 మందికి పరీక్షలు చేసేలా కార్యాచరణ రూపొందించారు.

లక్షణాలు.. కౌన్సెలింగ్

వైద్యాధికారి, ఏఎన్‌ఎం, ల్యాబ్‌టెక్నీషియన్, ఆశ కార్యకర్తలతో కూడిన ఆర్‌బీఎస్‌కే బృందం పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లల్లో పోషకాహార లోపం, ఐరన్ అందకపోవడం, ఫోలిక్ యాసిడ్ లభ్యత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరం, తలనొప్పి, అలసట, బలహీనతతో బాధపడుతున్నారు. సాధారణ రక్తహీనత ఉంటే ఐరన్ మాత్రలు అందిస్తున్నారు. అతి తీవ్రత ఉంటే ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. మరోవైపు పోషకాహారం తీసుకోవడం తదితర విషయాలపై వైద్యులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో లక్ష్యం..



ఆర్‌బీఎస్‌కే బృందాలు ఉపయోగిస్తున్న వాహనం

జిల్లాలో 24,400 మంది విద్యార్థులకు పరీక్షలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటివరకు 11,272 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. 4,050మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ 12శాతం కంటే ఎక్కువగా ఉంది. వీరంతా సాధారణ స్థితిలోనే ఉన్నారు. 1,868 మంది విద్యార్థులకు 11నుంచి 11.09శాతం వరకు ఉంది. 4,388 మంది విద్యార్థులకు రక్తం 8 నుంచి 10.09 శాతం వరకు ఉంది. 935 మంది విద్యార్థులకు 8 గ్రాముల కన్న తక్కువగా ఉంది. 250 మంది విద్యార్థులను తదుపరి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. 8,303 మంది విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

గ్రాముల ప్రకారం తీవ్రత పరిగణన

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యంపై సరైన అవగాహన ఉండదు. దీంతో పిల్లలు వివిధ రకాల జబ్బులకు గురవుతుంటారు. అలాంటి వారికి ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం జిల్లాలో ఆర్‌బీఎస్‌కే 8బృందాలను నియమించారు. వీరు ప్రత్యేకంగా వాహనాల ద్వారా పాఠశాలలను సందర్శిస్తున్నారు. ఒక్కో వాహనంలో ఇద్దరు వైద్యులు, ఏఎన్‌ఎం, ఫార్మాసిస్ట్ ఉన్నారు. హిమోగ్లోబిన్ 8శాతం కంటే తక్కువగా ఉంటే తీవ్రంగా పరిగణిస్తారు. 8 నుంచి 10శాతం ఉన్నవారికి మధ్యమం, 11 నుంచి 11.09శాతం పైగా ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. విద్యార్థులకు పరీక్షలు చేశాక ఫలితాల ప్రకారం వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు.

పౌష్టికాహారంతో చెక్



రక్తహీనత బారిన పడవద్దంటే వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. కాళ్లు, చేతులు శుభ్రత తప్పనిసరి. తద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. రోజు ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలి. రక్తంలో ఐరన్ పెంచే పల్లిపట్టీలు, బెల్లం, పాలు, చిరుధాన్యాలు, సీజనల్‌గా లభించే పండ్లు, ఖర్జూర వంటివి తినాలి. పిల్లలకు ఆకలి కావడం లేదంటే నులిపురుగులు శరీరంలో ఉండే అవకాశం ఉందని తల్లిదండ్రులు భావించి వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఒకవేళ రక్తహీనత బారిన పడితే అల్బెండజోల్ ఐరన్, మరి చిన్నారులైతే సిరప్‌లు అందించాలి. బాలికలకు ఐరన్ మాత్రలు ఇవ్వాలి. హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే చికిత్స చేయాల్సి వస్తుంది. పౌష్టికాహారం తీసుకుంటేనే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చు.

– ఎండీ జుబేర్‌సాహిల్,
ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



ఏసీపీ, ఎస్సైలను సన్మానిస్తున్న వ్యవస్థాపకులు

జైపూర్: వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని జైపూర్ ఏసీపీ ఏ.వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని వేలాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 8 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న మల్లన్న స్వామి జాతర ఏర్పాట్లను వేలాల ప్రత్యేక అధికారి విద్యాసాగర్, స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు, ఆలయ వ్యవస్థాపకులు చొప్పకట్ల శ్రీకాంత్‌తో కలిసి ఏసీపీ పరిశీలించారు. వేలాల గుట్టపై దొణలో మల్లన్నస్వామిని దర్శించుకుని ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో దేవుడ్ని దర్శించుకుని తిరిగి క్షేమంగా ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రోడ్లు మరమ్మతులు చేయించాలని, ట్రాఫిక్ సమస్య రాకుండా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని తెలిపారు. మొదటి రోజున గుట్టపైన జాతరకు, రెండు, మూడో రోజున గుట్ట కింద మల్లికార్జున స్వామి జాతర కొనసాగించేందుకు అధికారులు చేపట్టే ఏర్పాట్లను వివరించారు. గోదావరి నది వద్ద భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. స్థానిక నాయకులు ప్యాగ లక్ష్మణ్, డేగ నగేశ్, తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు



సమ్మక్కను గద్దెపైన ప్రతిష్ఠిస్తున్న పూజారి కృష్ణదొర



గోదావరితీరంలో భక్తజనసందోహం

జాతర.. భక్తజన సంద్రం

- గద్దెలపైకి చేరిన సారలమ్మ, సమ్మక్క
- దర్శనానికి పోటెత్తిన భక్తులు



సమ్మక్కను తీసుకు వస్తున్న పూజారి కృష్ణదొర



దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల గోదావరి నదీతీరం జనసంద్రమైంది. సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తడంతో సందడిగా మారింది. గురువారం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో శివసత్తులు, మహిళల పూనకాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య సమ్మక్క గద్దెపైకి చేరింది. జాతర సమీపంలోని చిలుకలగుట్టగా భావించే తల్లుల ఇల్లారి(గుడి) వద్దకు చేరింది. అమ్మవారి గుడి వద్ద మేడారం నుంచి వచ్చిన గిరిజన పూజారి క్రిష్ణదొర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరనారి ప్రతిరూపమైన కంకుమ భరిణె(అమ్మవారిని)ను అశేష జనవాహిని తరలిరాగా డప్పుచప్పుళ్లు, ఒగ్గుడోలు కళాకారుల ఆటపాటలు, టపాసుల మోత మధ్య పోలీసుల వలయంలో ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. దారి పొడవునా భక్తులు బారులు తీరి స్వాగతం పలికారు. జాతర వేడుకల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున ఏకలవ్య ఆశ్రమం సమీపంలోని కంకవనం వద్ద గిరిజన పూజా రి కృష్ణదొర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సేవా కమిటీ సభ్యులతో కలిసి పూజారులు కంకవనాలను డప్పుచప్పుళ్ల మధ్య సమ్మక్క గద్దె వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మ దర్శనానికి భక్తులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. పోలీసులు వరుస క్రమంలో భక్తుల దర్శనానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, జాతర ప్రత్యేక అధికారి రంగు కిషన్, ఆలయ ఈవో ముక్తా రవి పాల్గొన్నారు.

దర్శించుకున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మ వన దేవతలను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దర్శించుకున్నారు. గురువారం ఆమె మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, పలువురు కౌన్సిలర్లతో కలిసి దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారి సుదాకర్, కౌన్సిలర్లు బొద్దున సంధ్యారాణి, మడిగ మల్లయ్య, నాయకులు గెల్లు మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఇటిక్యాలలో సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు

గద్దెపైకి సమ్మక్క

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో గురువారం సమ్మక్క దేవతను పూజారులు గద్దెపైకి తీసుకువచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ జాతరకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రదేశంలోని దుకాణాల్లో గాజులు కొనుగోలు చేశారు.



గాజులు కొనుగోలు చేస్తున్న సురేఖ



మొక్కులు తీర్చుకుంటున్న చైర్మన్ ఉప్పలయ్య

క్లుప్తంగా

కలప తరలిస్తున్న కారు పట్టివేత



అధికారులు పట్టుకున్న కారు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ సెక్షన్ నుంచి కామన్‌పల్లి వైపు అక్రమంగా కలప తరలిస్తున్న కారును పట్టుకున్నట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. గురువారం కవ్వాల్ నుంచి జన్నారం వైపు అతివేగంగా వెళ్తున్న కారును అనుమానం వచ్చిన కవ్వాల్ సెక్షన్ సిబ్బంది వెంబడించి తనిఖీ చేయగా అందులో 6 టేకు దుంగలు లభించాయి. కారు, కలపను డివిజన్ కార్యాలయానికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న దేవునిగూడకు చెందిన రాగి పవన్‌కుమార్, దస్తూరాబాద్ మండలం రేవోజీపేటకు చెందిన ఓరుగంటి నర్సింహాచారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.37వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



సమ్మయ్య (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన విజ్జగిరి సమ్మయ్య(51) హాజీపూర్ మండలం వేంపల్లి శివారులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంచిర్యాల తోళ్లవాగు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటుండగా ఇటీవల ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 20న రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు రోహిత్, కుమార్తె సునందిని ఉన్నారు. రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

- యూపీఏ పాలనలో అనేక కుంభకోణాలు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మికులు, బెంగాలీలతో సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా కార్యాలయంలో గురువారం సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) కార్మికులతో సమావేశం అయ్యారు. కాగజ్‌నగర్ మండలంలోని వేదమందిర్ వద్ద బెంగాలీ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ పాలనలో 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు, కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ, తదితర కుంభకోణాల్లో రూ.12లక్షల కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగుచెంది 2014 ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని స్పష్టం చేశారు. ఈ పదేళ్లలోనే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని అన్నారు. మచ్చలేని నాయకుడిగా మోదీ పేరు తెచ్చుకున్నారని, శత్రువు కూడా మెచ్చుకున్న నాయకుడిగా నిలిచారని కొనియాడారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉగ్రవాదం, తీవ్రవాదం, ఐఎస్‌ఐ దాడులు ఇప్పుడు లేవని తెలిపారు. ఇప్పటికీ కొన్ని పార్టీలు ఓటుబ్యాంకు, కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఒక్క బీజేపీ మాత్రమే ప్రజాపాలన చేస్తోందన్నారు. దేశంలో జాతీయ రహదారులు, ఉత్పత్తి రంగాల్లో గణనీయమైన మార్పులు రావడంతో ఉపాధి పెరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా కరోనా వ్యాక్సిన్లు తయారు చేసి దేశ ప్రజలకు ఉచితంగా అందించామని, అలాగే 150 దేశాలకు సరఫరా చేశామన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతోనే ఇదంతా సాధ్యమైందన్నారు. అంతకు ముందు ప్రజాకార్యాలయంలో దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, ప్రభారి రాజమౌళి, కల్లోల భట్టాచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


గాంధారి మైసమ్మ జాతర



కొలువుదీరిన మైసమ్మ తల్లి

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు
- తరలిరానున్న అశేష భక్తజనం

రామకృష్ణాపూర్(చెన్నూర్): మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులో ఉన్న గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు సన్నద్ధమవుతోంది. గిరిజనుల ఆరాధ్యదైవం గాంధారి మైసమ్మ ఖిల్లాలో కొలువై ఉండడంతో ఏటా మూడు రోజుల పాటు ఇక్కడ జాతర నిర్వహిస్తారు. చారిత్రాత్మక ప్రాంతం.. ఎంతగానో ప్రాశస్త్యమున్న ఖిల్లాలో అధికారికంగా జాతర నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా కొన్నేళ్ల నుంచే జాతర నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బొక్కలగుట్ట శివారు నుంచి జాతర జరిగే ఖిల్లా ప్రాంతానికి వెళ్లేందుకు ఇప్పటికే రోడ్డు నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్, నీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లు చేశారు. ఆరెకరాల విస్తీర్ణంలో ఉన్న జీడికోటలో మూడు రోజుల పాటు జరుగనున్న ఈ గాంధారి మైసమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.




గాంధారి ఖిల్లా ప్రవేశ ద్వారం

జాతర నిర్వహణ ఇలా...

మొదటి రోజు శుక్రవారం దేవతా మూర్తులను మంచిర్యాలలోని గోదావరినదికి స్నానానికి తీసుకెళ్తారు. డప్పు చప్పుళ్లు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల నడుమ గోదావరికి తీసుకెళ్లి సాయంత్రం సదర్‌భీమన్న వద్దకు తీసుకువస్తారు. ఇక్కడ రాత్రి ఆట పాటలతో గడిపి మరుసటి రోజు మధ్యాహ్నం జాత ర జరిగే ఖిల్లా ప్రాంతానికి తరలిస్తారు. రాత్రి మరోసారి ఆటపాటలు నిర్వహించి ఆదివారం తెల్లవారుజామున గాంధారి ఖిల్లా పైభాగంలో ఉన్న మైసమ్మ తల్లి వద్ద పట్నాలు వేసి, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం జీడికోటలో నిర్వహించే దర్బార్(సభ)వద్దకు తిరిగివస్తారు. దర్బార్‌లో గిరిజనుల సాంస్కృతిక తీరుతెన్నులు, వనదేవతలను పూజించడంలో విశిష్టత, గాంధారి ఖిల్లా అభివృద్ధిపై చర్చిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న జాతరలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన, నాయక్‌పోడ్ సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

ఒడ్డెరాజుల కాలంలో వెలుగొందిన ఖిల్లా...

సుమారు 600 సంవత్సరాలకు పూర్వం కాకతీయుల సామంతులుగా పిలువబడే ఒడ్డెరాజుల కాలంలో గాంధారి ఖిల్లా వెలుగొందినట్లు చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయి. ఒడ్డె రాజుల అనంతరం గోండు రాజులు ఈ ఖిల్లాను కేంద్రంగా చేసుకుని పాలించారని చెబుతుంటారు. ఒడ్డె రాజుల కాలంలో నిర్మించిన ఈ ఖిల్లా అప్పటి వారి కళా నైపుణ్యానికి అద్దంపడుతోంది. ఖిల్లాలో నాగశేషుడి విగ్రహం, శివుడు, విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు, కాలభైరవుని విగ్రహాలతో పాటు దేవతామూర్తుల విగ్రహాలు ఉంటాయి. ఖిల్లాపై భాగంలో శత్రువుల రాకను పసిగట్టేందుకు నగారా గుండు నిర్మించారు. కొండను తొలిచి నిర్మించిన నాగశేషుడి ఆలయం ఆకట్టుకుంటుంది. దిగువ భాగంలో సహజసిద్ధంగా ఉండే ఊటచెలిమెకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ నీళ్లు ఎప్పటికీ ఇంకిపోకుండా పైకి తేలుతుంటాయి. గుట్టపై నిర్మించిన కోటలో అనేక కళారూపాలు, శిలాసంపద, విగ్రహాలు ఉండటంతో జాతరకు హాజరయ్యే భక్తులతో పాటు ఖిల్లాను తిలకించేందుకు వచ్చే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది.



కాలభైరవుడి విగ్రహం



జాతర జరుగనున్న ప్రాంతం

25న సీఓఈ సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్

- ఆదిలాబాద్ రీజియన్‌లో నాలుగు పరీక్ష కేంద్రాలు
- గురుకుల వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు

బెల్లంపల్లి: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 25న సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 4న నిర్వహించిన మొదటి విడత ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రెండో విడత పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, బెల్లంపల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. బాలబాలికల కోసం రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, లక్సెట్టిపేట, చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులకు డిస్క్రిప్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అనుమానాల నివృత్తి, ఇతర వివరాల కోసం 9948714105 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

కాసిపేట: సోమగూడెం(బి) గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కొరకొప్పుల ప్రమీలగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. పాతబెల్లంపల్లి ఎంపీటీసీ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకుడు ముత్తె భూమయ్య సర్వే నంబర్ 2పైకి, 3పైకిలలో భూములు కబ్జా చేశారని ప్రమీలగౌడ్ సోషల్ మీడియాలో ఆరోపించారు. ఆ వీడియోల ద్వారా తగాదాలు ఏర్పాడే అవకాశం ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలని ముత్తె భూమయ్య బుధవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోచమ్మా... నీ పార్కు తీరు కనవమ్మా...!



పచ్చగడ్డి ఎండిపోయి దర్శనమిస్తున్న వాకింగ్ ట్రాక్



తల తెగిపోయి ఉన్న కొంగ బొమ్మ



తొండం, తోక విరిగి పోయి ఉన్న ఏనుగు బొమ్మ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ చెరువు పార్కును పట్టణ ప్రగతి నిధులు రూ.48 లక్షలతో నిర్మించి 2022 నవంబర్ 5న ప్రారంభించారు. రెండేళ్ల లోపే అధ్వానంగా మారడంతో చిన్నారులకు ఆటవిడుపు లేకుండా పోతోంది. పార్కు ఆవరణలో పచ్చిక బయళ్లు కానరావడం లేదు. వాకింగ్ ట్రాక్‌లో, అంతర్భాగంలో పెంచిన గడ్డి ఎండిపోయి పార్కు కళావిహీనంగా మారింది. నీళ్లు పట్టకపోవడంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. చిన్నారులను ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన ఏనుగు, కొంగబొమ్మలు విరిగి పోయాయి. నెమలి, జింక, పులి, తదితర బొమ్మల రంగులు వెలిసిపోయాయి. రాత్రిపూట ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ కొరవడటంతో పార్కు ఎందుకూ కొరగాకుండా పోతోందని పుర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గద్దెపై కొలువుదీరిన సమ్మక్క



సమ్మక్కకు మొక్కుతున్న జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, జీఎం మనోహర్

- జాతరకు పోటెత్తిన భక్తజనం

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్కే1ఏ గని శివారులో పాలవాగు వద్ద ఏర్పాటు చేసిన జాతరలో గురువారం సమ్మక్కను గద్దెకు తీసుకొని వచ్చారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య సమ్మక్కను మందమర్రికి చెందిన దూలం కనకయ్య ఇంటి నుండి ఊరేగింపుగా జాతర ప్రాంగణానికి తీసుకువచ్చారు. మేడారంకు చెందిన గిరిజన పూజారుల వేదమంత్రోచ్ఛణాలతో సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. కార్మిక కుటుంబాలతో పాటు పరిసర గ్రామాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డైరెక్టర్ మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కె.కర్ణ, మందమర్రి జీఎం మనోహర్, జీఎం ఎన్విరాన్‌మెంట్ గణపతి, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీ, ఆయా యూనియన్లు, రాజకీయ పార్టీల నాయకులు దర్శించుకున్నారు.



సమ్మక్కను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

జ్వరంతో మైనార్టీ పాఠశాల విద్యార్థిని మృతి

- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన షేక్ కరీం, ఫాతీమ దంపతుల కుమార్తె షేక్ అంజుమ్(13)గురువారం జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్‌లోని మైనార్టీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ అంజుమ్ ఈ నెల 20న అనారోగ్యానికి గురికావడంతో పాఠశాల సిబ్బంది ఫోన్ ద్వారా బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు పాఠశాలకు వెళ్లి బాలికను ఇంటికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయాన్నే ఆసిఫాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి రక్త పరీక్షలు చేయించగా ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించి చికిత్స ప్రారంభించారు. గురువారం తెల్లవారు జామున మళ్లీ అస్వస్థతకు గురికావడంతో మహారాష్ట్రలోని చంద్రపూర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.



షేక్ అంజుమ్(ఫైల్)


ముందుగా తెలిసుంటే కాపాడుకునే వాళ్లం..

తమబిడ్డ ఆరోగ్యం పూర్తిగా క్షీణించాకే సమాచారం అందించారని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ముందుగానే తెలిసుంటే కాపాడుకునే వారిమని, పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమబిడ్డ ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పాఠశాలలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని భోజనం నాణ్యతతో కూడుకున్నది కాకుండా ఇష్టరీతిన వడ్డిస్తున్నారని పేర్కొంది. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి కింద నీటి మడుగులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ రవీందర్ తెలిపారు. జాలర్ల సాయంతో బయటకు తీసి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. నీటి మడుగు పక్కనే ఒడ్డుకు ఓ షర్ట్ లభించిందని, ఆ షర్ట్‌ను పరిశీలించగా ఈ నెల 19 న చెన్నూర్ నుంచి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సులో వచ్చినట్లు బస్సు టిక్కెట్ లభించిందన్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 8712656534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నగేశ్ (ఫైల్)

జన్నారం: కారును ఓవర్ టేక్ చేయబోయి బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఒకరు మృతి చెందిన సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం అలీనగర్ గ్రామానికి చెందిన సిడాం నగేశ్ (45), కుర్సింగ భీంరావు గురువారం ద్విచక్ర వాహనంపై దండేపల్లి మండలం తాళ్లపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మహ్మదాబాద్ గ్రామ సమీపంలో కారును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి కిందపడ్డారు. నగేశ్ అక్కడికక్కడే మృతి చెందగా భీంరావు గాయాలైనట్లు మృతుని సోదరుడు కృష్ణ తెలిపారు. భీంరావును లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య శారద, కూతురు పూజ ఉన్నారు.

పూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం

- నిందితుడిపై కేసు నమోదు
- రిమాండ్‌కు తరలింపు

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని బోరంపల్లిలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతుల విగ్రహాలను బుధవారం రాత్రి గ్రామానికి చెందిన ఉడుత బాపు గొడ్డలితో ధ్వంసం చేశాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామ కార్యదర్శి మధుకర్ ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుధాకర్ తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలోని హనుమాన్ విగ్రహం ధ్వంసం చేయడంతోనే పూలే విగ్రహాలను ధ్వంసం చేసి ఉంటారని గ్రామంలో పెద్ద ఎత్తున చర్చించుకోవడం కొసమెరుపు. గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో వెలిసిన హనుమాన్ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన కొంతమంది నాస్తికులు ధ్వంసం చేశారని, ఆ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యువత పోలీసులకు ఫిర్యాదు చేశారు.



బోరంపల్లిలో ధ్వంసమైన పూలే విగ్రహం

బీపీఏలో సింగరేణి డైరెక్టర్ల పర్యటన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో గురువారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంవోఈఎఫ్ (ఐఆర్‌వో హైదరాబాద్ కార్యాలయం) డైరెక్టర్ తరుణ్ పర్యటించారు. కైరిగూడ ఓసీపీలోని క్వారీ లోపలికి వెళ్లి బొగ్గు ఉత్పత్తి పనులను పరిశీలించారు. అనంతరం ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు పలు అంశాలపై ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఎంవోఈఎఫ్ డైరెక్టర్ తరుణ్ కైరిగూడ ఓసీపీ వద్ద పర్యావరణాన్ని పరిశీలించి పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా జీఎం రవిప్రసాద్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఎల్ గణపతి, కార్పొరేట్ అడిషనల్ మేనేజర్లు రవికిరణ్, శ్రీనివాస్, కైరిగూడ పీవో సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ పాటింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారులు హరీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోరీకి గురైన బైక్‌లు స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల చోరీకి గురైన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. జైనథ్ మండలంలోని జామ్నికి చెందిన ఖండేష్కర్ గౌతమ్ ఈ నెల 18న రిమ్స్ ఎమర్జెన్సీ వార్డు ముందు బైక్‌ను పార్క్ చేసి ఆస్పత్రి లోనికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ మాయమైంది. శ్రీరాం కాలనీకి చెందిన పీసర రమేశ్ బాలాజీ ఆస్పత్రి ఎదుట బైక్ పార్క్ చేశాడు. గంట తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకుండా పోయింది. ఇద్దరూ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు.